## చిట్టీల పేరుతో కుచ్చుటోపీ..3కోట్లతో పోలీస్ జంప్

విశాఖపట్టణం, విశాఖలోని ఎండాడలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఓ వ్యక్తి కుటుంబం చీటీల పేరుతో జనానికి కుచ్చుటోపీ పెట్టింది. ఏకంగా రూ.3 కోట్ల జనం సొమ్ముతో కానిస్టేబుల్ అండ్ ఫ్యామిలీ జంప్ అయింది. దీంతో బాధితులు ఏం చేయాలో అర్థం కాక.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనకాపల్లి డివిజన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. భార్య రవణమ్మ, కూతురుతో కలిసి ఎండాడలో ఉంటున్నారు. జగ్గారావు పోలీస్ కావడంతో.. అతని భార్య రవణమ్మ.. పోలీసమ్మ అవతారం ఎత్తింది. స్థానికంగా బాగానే పరిచయాలు పెంచుకుంది. అంతే కాదు 2019లో చీటీల వ్యాపారం షురూ చేసింది రవణమ్మ. లక్ష రూపాయల నుంచి 5 లక్షల రూపాయల వరకు చీటీలు నడిపించేది. క్రమంగా చీటీల దందాలోకి జగ్గారావు కూడా దిగాడు. బంధువులు, చుట్టుపక్కల అపార్టుమెంట్లలో ఉండేవాళ్లు, చిన్న చిన్న ఉద్యోగులు, ఇళ్లల్లో పని చేసేవారు, వాచ్‌మెన్లు.. ఇలా ఎవరినీ వదలలేదు. అందరితో మంచి మాటలు కలిపి చీటీలు వేయించారు. జనాల లక్షలకు లక్షలు వసూలు చేశారు. మరోవైపు జనం కూడా పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం చీటీలు వేసుకుంటూ వచ్చారు..

# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :196 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 11-10-2025 | పేజీలు:4 వెల: 2.00

## తెలంగాణలో మినరల్స్ నిక్షేపాలు



హైదరాబాద్ : ఇసుకతో పాటు,ఇతర మినరల్స్‌తవ్వకాలను చేపట్టేందుకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ నిర్ణయించింది. ఖనిజ అభివృద్ధి సంస్థ ప్రస్తుతం ఒక్క ఇసుక విక్రయాలు మాత్రమే నిర్వహిస్తుండా, మిగిలిన ఖనిజాలను టెండర్ల పద్దతిలో ప్రైవేటు వ్యక్తులకు కేటాయింపులు చేస్తోంది. అయితే అనుమతి పొంది సంబంధిత ఖనిజతవ్వకాలను చేస్తున్న సంబంధిత కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతూ రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నట్లు సంస్థ గుర్తించింది. దీంతో ఇసుకతో పాటు, ఇతర ఖనిజాలను కూడా సంస్థ ద్వారా చేపట్టాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఖనిజ అభివృద్ధి సంస్థ అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. రాష్ట్రంలో ఇసుకుతో పాటు, డోలమైట్, గ్రానైట్, సున్నపురాయి, మార్బుల్, మైకా తదితర ఖనిజాల నిల్వలు ఉన్నాయి. ప్రభుత్వం నుండి అనుమతి వచ్చినట్లయితే వీటన్నింటినీ ఇక నుండి సొంతంగానే తవ్వకాలు జరిపాలని అధికారులు నిర్ణయించారు. కాగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీగా గ్రానైట్, సున్నపు రాయి నిల్వలు ఉన్నట్లు బయటపడింది.

మినరల్స్ తవ్వకాల విశ్లేషణ: గ్రానైట్, సున్నపురాయి ప్రధాన నిల్వలు

ఈ మేరకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షల్లో రాష్ట్రంలోని 5 జిల్లాల్లో గ్రానైట్, సున్నపు రాయి. నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించింది. ప్రధానంగా కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో గ్రానైట్‌నిల్వలు భారీగా ఉన్నట్లు తేల్చింది. కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు, ఖమ్మం జిల్లాలో కొత్తగట్టు, నమిలికొండ, వెంతడుప, తాళ్లపూసపల్లె తదితర ప్రాంతాల్లో 83.25 హెక్టార్ల విస్తీర్ణంలో 28,400 క్యూబిక్ మీటర్లలో తెలుపు, బ్రౌన్, నలుపు రకాలకు చెందిన గ్రానైట్ నిల్వలు ఉన్నాయి. అదేవిధంగా నల్లగొండ, సూర్యాబాద్, వికారాబాద్ జిల్లాల్లో సున్నపు రాయి నిక్షేపాలు ఉన్నట్లు కనుగొంది. ఆయా జిల్లాల్లోని సూర్యాపేట్ జిల్లాలోని మేళ్లచెర్వు, మఠంపల్లి, రఘునాధపాలెం, రామాపురం, దొండపాడు, నల్లగొండ జిల్లా తామరచెర్ల, వికారాబాద్ జిల్లా మల్కాపూర్, జివంగి ప్రాంతాల్లో 276.83 కిలోమీటర్ల విస్తీర్ణంలో సున్నపు రాయి నిల్వలు ఉన్నట్లు గుర్తించింది. ఈ మేరకు వీటికి సంబంధించిన తాజాగా నివేదికను ఖనిజాభివృద్ధి సంస్థ ప్రభుత్వానికి సమర్పించింది. ఇదే సమయంలో ఈ నిక్షేపాలను తవ్వేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది.

## రేవంత్ రెడ్డికి అగ్ని పరీక్ష.. ఇటు జూబ్లీహిల్స్.. అటు స్థానికం!

హైదరాబాద్,తెలంగాణలో ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలిసారిగా అగ్ని పరీక్షను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు స్థానిక ఎన్నికలు, మరోవైపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ఎదుర్కోవాల్సిరావడం రేవంత్ రెడ్డికి నిజమైన సవాల్ గా చెబుతున్నారు. ఈ రెండింటిలోనూ పార్టీని విజయతీరాలకు చేర్చడం సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత. ఈ విజయాలే ఆయన భవిష్యత్తును నిర్దేశించనుండటంతో గెలిచి తన నాయకత్వానికి తిరుగులేదని నిరూపించుకోవాల్సివుంటుందని అంటున్నారు. అంతేకాకుండా ఈ రెండు ఎన్నికల ఫలితాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రెఫరెండంగానూ చూస్తున్నారు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న రేవంత్ రెడ్డి సుమారు రెండేళ్లుగా అనేక సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. అదే సమయంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన కొన్ని హామీలను అమలు చేయలేక దిక్కులు చూస్తున్నారని విపక్షాలు పెద్ద ఎత్తున విమర్శలు చేస్తున్నాయి. అంతేకాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటను ఆయన మంత్రివర్గ సహచరులు లెక్క చేయడం లేదని, పేరుకే ఆయన ముఖ్యమంత్రి అని కీలక శాఖలపై పర్యవేక్షణ అధికారం లేకుండా కాంగ్రెస్ అధిష్టానం కత్తెర వేసిందని కూడా సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వంలో తానే సుప్రీం పవర్ అని నిరూపించుకోవడం సీఎం రేవంత్ రెడ్డికి అత్యావసరంగా చెబుతున్నారు.జూబ్లీహిల్స్ ఎన్నికతోపాటు స్థానిక ఎన్నికల్లో పార్టీని గెలిపించి ప్రజల్లో తనపై పరపతి చెక్కుచెదరలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరూపించుకోవాల్సివుంటుంది. అయితే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక సవాళ్లు ఎదుర్కొన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా స్థానిక ఎన్నికలను ఇన్నాళ్లు వాయిదా వేసుకుంటూ వచ్చారు. ప్రభుత్వం వచ్చిన కొద్దిరోజులకే స్థానిక ఎన్నికలను నిర్వహించాల్సి ఉండగా, రేవంత్ రెడ్డి కొన్నాళు సమయం తీసుకోడానికి వాయిదా వేశారు. అలా ఏడాదిన్నర అయిపోయింది.



ఇక ఇప్పుడు ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుని పార్టీ మరింత బలపడిందని చాటుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు.ఇదే సమయంలో ఊహించని విపత్తులా వచ్చిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కూడా కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఒత్తిడి పెంచుతోందని అంటున్నారు. దీంతో ఈ నెలలో జరిగే స్థానిక ఎన్నికలు, వచ్చే ఎన్నికల్లో జరిగే పంచాయతీ పోరు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అగ్నిపరీక్షగా చెబుతున్నారు. గత ఎన్నికల్లో హైదరాబాదు నగరంలో కాంగ్రెస్ ఒక్కస్థానం కూడా దక్కించుకోలేకపోయింది. ఎన్నికల తర్వాత జరిగిన కంటోన్మెంట్ ఎన్నికల్లోనే ఖాతా తెరిచింది. ఇక గ్రేటర్ ఎన్నికల ముందు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిస్తే నగరంపైనా కాంగ్రెస్ జెండా ఎగరవేయొచ్చని సీఎం భావిస్తున్నారు. దీంతో జూబ్లీహిల్స్ ను ఎట్టిపరిస్థితుల్లో కైవసం చేసుకోవాలని సీఎం పావులు కదుపుతున్నారు. మొత్తానికి ఒకేసారి ఎదురైన ఎన్నికల్లో గెలవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ గా మారిందని అంటున్నారు.

## కఫ్ సిరప్ మరణాలపై జ్యుడీషియల్ కమిషన్ విచారణ కోరుతూ వేసిన పిల్ కొట్టివేత

న్యూఢిల్లీ,అక్టోబర్10: దగ్గు సిరప్ మరణాలపై జ్యుడీషియల్ కమిషన్ లేదా నిపుణుల కమిటీతో స్వతంత్ర దర్యాప్తు కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను తోసిపుచ్చింది. న్యాయవాది, పిటిషనర్ విశాల్ తివారీ తన కెరీర్‌లో ఎన్నిసార్లు పిల్‌లు దాఖలు చేశారని ప్రశ్నించింది. ప్రస్తుతం నిషేధించబడిన కోల్డ్రిఫ్ సిరప్ తయారీ సంస్థ ఉన్న మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు పరస్పరం నిందించుకుంటూ, విమర్శలకు దిగుతున్నాయని, వాటి దర్యాప్తులో ఎటువంటి గణనీయమైన చర్యలు తీసుకోకుండానే సమయం వృధా అవుతోందని తివారీ అన్నారు. తివారీ కేంద్రీకృత దర్యాప్తును కోరారు. ఎఫ్ఐఆర్‌లను సిబిఐకి బదిలీ చేయాలని న్యాయవాది పిటిషన్‌లో కోరారు. పరిశ్రమల్లో వినియోగించే విషపూరిత రసాయనమైన డైఇథిలిన్ ÷–లగైకాల్ కలిగిన కలుషితమైన దగ్గు సిరప్‌ల తయారీ, నియంత్రణ, పరీక్ష మరియు పంపిణీపై సమగ్ర విచారణ జరపాలని, ఔషదాల తయారీకి తగిన సూచనలు జారీ చేయాలని పిటిషన్ కోరింది. కోల్డ్రిఫ్ స్టాక్‌ను స్వాధీనం చేసుకోవాలని,



వాటి పంపిణీ, విక్రయాలను నిలిపివేయాలని కోరింది. మధ్యప్రదేశ్‌లో కోల్డ్రిఫ్ దగ్గు సిరప్‌తో 22మంది మరణించిన సంగతి తెలిసిందే. ఆ సిరప్‌ను సూచించిన ప్రభుత్వ వైద్యుడిని ఇటీవల పోలీసులు అరెస్ట్ చేశారు. అతనిపై మరియు తమిళనాడుకి చెందిన సిరప్ తయారీదారుపై కేసు నమోదు చేశారు.

## 'నాన్న ఉద్దేశం అర్థమైంది' కవిత కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్,బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్ పై మాజీ ఎమ్మెల్సీ కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. తన తండ్రి కేసీఆర్ అసలు ఉద్దేశం ఏంటో సస్పెన్షన్ తర్వాతే తనకు తెలిసిందని ఆమె వెల్లడించారు. ఓ జర్నలిస్టుకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్ ఎపిసోడ్ ప్రస్తావనకు వచ్చింది. ఆ సమయంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పై కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తన సస్పెన్షన్ ఉత్తర్వులపై కేసీఆర్ సంతకం లేకపోయినా ఆయన 'ఉద్దేశం' ఏంటో తనకు తెలిసిందని కవిత వెల్లడించారు.బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడం బాధ పెట్టినట్లు కవిత తెలిపారు. తాను పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు ఎప్పుడూ చేయలేదని స్పష్టం చేశారు. కొంతమంది కారణంగానే ఇది జరిగిందని, కుటుంబానికి దూరమవడం తేలికైన విషయం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. కవిత. కాగా, ఆమె తాజా వ్యాఖ్యల తర్వాత బీఆర్ఎస్ నుంచి కవితను సాగనంపడంపై కేసీఆర్ రెండో ఆలోచన చేయలేదని అభిప్రాయపడుతున్నారు. బిడ్డపై మమకారంతో ఆయన అడ్డు చెప్పి ఉంటారని ఇన్నాళ్లు ఓ వాదన వినిపించగా, తన సస్పెన్షన్ వెనుక 'ఉద్దేశం' ఆయనదేనంటూ కవిత చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది.అంతేకాకుండా సొంత పార్టీ పెట్టే దిశగా కవిత అడుగులు వేస్తున్నారన్న ప్రచారం నేపథ్యంలో కుటుంబానికి దూరంగా ఉండటం తేలికైన విషయం కాదంటూ కవిత చెప్పడం మహిళా సెంటిమెంటును టచ్ చేసే ఉద్దేశమే అంటున్నారు. తనను బీఆర్ఎస్ నుంచి బలవంతంగా వెళ్లగొట్టేందుకు ప్రయత్నించారని, ఈ విషయం తెలుసుకోకుండా తన తండ్రి పార్టీ నుంచి సస్పెన్షన్ చేశారని చెప్పడానికే కవిత ఇలా మాట్లాడుతున్నారా? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్ అనంతరం కవిత వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారని చెబుతున్నారు. కొత్త పార్టీ ప్రకటనపై సహచరులతో సమాలోచనలు జరుపుతున్న కవిత తగిన సమయం కోసం ఎదురుచూస్తున్నారని అంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న జూబ్లిహిల్స్ ఉప ఎన్నికతోపాటు స్థానిక ఎన్నికల్లో తమ మద్దతు ఎవరికీ ఇవ్వకుడదని కూడా కవిత భావిస్తున్నట్లు చెబుతున్నారు. పెద్దగా సమయం లేకపోవడం, పార్టీ నిర్మాణం ఇంకా జరగకపోవడం వల్ల ఈ ఎన్నికలకు దూరంగా ఉండటమే మంచిదని ఆమెకు రాజకీయ ఉద్దండులు సలహా ఇచ్చినట్లు చెబుతున్నారు. ఇక ప్రజల్లో తన ఉనికి చాటుకోవడానికి సెంటిమెంటు రెచ్చగొట్టి ఫాలోయింగు పెంచుకోడానికి ఆమె వ్యూహరచన చేస్తున్నట్లు కనిపిస్తోందని అంటున్నారు.

## అలిగిన అంజన్ కుమార్ యాదవ్.. రేవంత్ రెడ్డిపై ఫైర్



హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు కాంగ్రెస్ పార్టీలో అగ్గిరాజేశాయి. ఉప ఎన్నికలో పోటీ చేయాలని భావించిన నేతలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. టికెట్ ఆశించి భంగపడిన మాజీ ఎంపీ, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్ అలకబూనారు. ఆయనను బుజ్జగించేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా అంజన్ కుమార్‌తో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తనను సంప్రదించకుండా అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారని అసంతృప్తి వ్యక్తం చేశారు. 40 ఏండ్లుగా పార్టీలో ఉన్నానని, తనను తీవ్రంగా అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మాత్రమే లోకల్, నాన్ లోకల్ సమస్య ఎందుకు వచ్చిందని వారిని ప్రశ్నించారు. గతంలో ఒకాయన కామారెడ్డిలో, మల్కాజ్‌గిరిలో పోటీ చేసినప్పుడు ఇది గుర్తుకు రాలేదా అని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వారిని నిలదీశారు. కష్టకాలంలోనూ కాంగ్రెస్‌లో ఉన్నానని, పార్టీ కోసం పని చేశానని మండిపడ్డారు. తనకు టికెట్ రాకుండా చేసింది ఎవరో త్వరలో చెబుతానని అన్నారు. కనీసం జూబ్లీహిల్స్ కమిటీలో కూడా తనను తీసుకోలేదని వాపోయారు. వాళ్లు తమను తొక్కుకుంటూ పోతే, తాము ఎక్కుకుంటూ పోతామని స్పష్టం చేశారు. తాను కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌నని, ఎక్కడైనా పోటీ చేయవచ్చన్నారు. జూబ్లీహిల్స్ అభ్యర్థిని ఎంపిక చేసేటప్పుడు కనీసం నన్ను సంప్రదించారా అని వారిని నిలదీశారు. కార్యకర్తలతో భేటీ తర్వాత తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు.

## వోడాఫోన్‌కు లబ్ది చేకూర్చిన బీజేపీ.. బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్ని ఎందుకు సవరించదు..?

హైదరాబాద్ : కేంద్రంలో అధికారంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంపై బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వోడాఫోన్ 40 వేల కోట్ల రూపాయల మేర ఇన్‌కమ్ టాక్స్ కట్టాలని సుప్రీం కోర్టు తీర్పు ఇస్తే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చట్టం ద్వారా దాన్ని తిరస్కరించింది. వోడాఫోన్‌కు లబ్ది చేకూర్చిన బీజేపీ బీసీల రిజర్వేషన్ల పెంపు కోసం రాజ్యాంగాన్ని ఎందుకు సవరించదు? అని బీజేపీ ప్రభుత్వాన్ని మాజీ ఎంపీ వినోద్ కుమార్ నిలదీశారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎంపీ మీడియాతో మాట్లాడారు.ఎన్నోసార్లు తమకు అనుకూలంగా ఉన్న విషయాలపై రాజ్యాంగాన్ని సవరించిన బీజేపీ బీసీల కోసం ఎందుకు సవరించదు? బీసీ కులగణనపై కూడా సుప్రీం తీర్పును దాటవేసేలా పార్లమెంటులో బీజేపీ చట్ట సవరణ తెచ్చింది. బీఆర్ఎస్ హైకోర్టులో ఎందుకు ఇంప్లీడ్ కాలేదని పొన్నం ప్రభాకర్ అంటున్నారు. బీఆర్ఎస్ డ్రామా కంపెనీ కాదు బీసీలతో రాజకీయాలు చేయడానికి. రాహుల్ గాంధీ బీసీ రిజర్వేషన్ల పెంపుపై పార్లమెంటులో కనీసం ప్రైవేట్ మెంబెర్ బిల్లునైనా పెట్టారా..? అని వినోద్ కుమార్ అడిగారు.తొమ్మిదో షెడ్యూల్‌లో చేరిస్తే తప్ప బీసీలకు రిజర్వేషన్లు పెరగవు. ఇప్పటికైనా ఢిల్లీలో కాంగ్రెస్ బీజేపీలు కలిసి తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చడం కోసం ప్రయత్నాలు చేయాలి. బీఆర్ఎస్ సహకరిస్తుంది. డ్రామాలు ఇప్పటికైనా కట్టిపెట్టండి. బీసీలను మోసం చేయాలనే వైఖరిని కాంగ్రెస్ విడనాడాలి. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నారు. మోడీపై ఒత్తిడి తెచ్చి బీసీ రిజర్వేషన్లు పెంచేలా వారు ఎందుకు కృషి చేయడం లేదు. తమిళనాడులో బీసీలకు విద్యా ఉద్యోగాల్లో 69 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి తప్ప స్థానిక సంస్థల్లో 50 శాతం మించి లేవు అని వినోద్ కుమార్ స్పష్టం చేశారు.

రేవంత్ రెడ్డి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు

హైదరాబాద్ : రేవంత్ రెడ్డి మాటలను ప్రజలు ఎన్నికలప్పుడు నమ్మారు కానీ.. ఇప్పుడు నమ్మే స్థితిలో లేరని బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన జీవో 9పై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో వినోద్ కుమార్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.




స్థానిక ఎన్నికలు, జీవో నంబర్ 9పై నిన్న హైకోర్టు స్టే ఇచ్చింది. తెలంగాణ ప్రజలు ఎవ్వరూ ఈ జీవోను నమ్మలేదు. రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో రిజర్వేషన్లు ఇచ్చినట్టు బీసీలు నమ్మలేదు. ప్రజలు ఈ జీవోపై ముందే తీర్పునిచ్చారు. మోసపోవడానికి ప్రజలు సిద్ధంగా ఉంటారని రేవంత్ గతంలోనే చెప్పారు. ఎన్నికలప్పుడు ఆయన మాటలు ప్రజలు నమ్మారు కానీ ఇపుడు నమ్మడం లేదు. దసరా పండగ అపుడే ప్రజలు ఎన్నికలు జరగవని నిర్ణయానికి వచ్చారు అని వినోద్ కుమార్ గుర్తు చేశారు.గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది 1 .6 శాతం ఓట్ల తేడాతోనే. నిన్న భట్టి విక్రమార్క బీజేపి, బీఆర్ఎస్‌లను విమర్శిస్తున్నారు. బీజేపీని విమర్శిస్తే అర్థం ఉంది. బీఆర్ఎస్‌ను విమర్శించడానికి లేదు. గతంలోనే కేసీఆర్ బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో బిల్లు ఆమోదింపజేసి కేంద్రానికి పంపారు. కేంద్రం వద్ద అది ఇంకా పెండింగ్‌లో ఉంది. బీఆర్ఎస్ చిత్తశుద్ధిని శంకించడానికి లేదు. ఇందిరాగాంధీ పదవికి ముప్పు వచ్చినపుడు ఏకంగా రాజ్యాంగాన్నే సవరించారు. ఓ వ్యక్తి కోసం కాంగ్రెస్ పార్టీ నాడు రాజ్యాంగాన్ని సవరించింది. స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల పెంపు కుదరదని కృష్ణమూర్తి కేసులో సుప్రీం తీర్పు వచ్చింది. అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఆ తీర్పుకు వ్యతిరేకంగా రాజ్యాంగ సవరణ ఎందుకు చేయలేదు..? ఇందిరాగాంధీ కోసం రాజ్యాంగాన్ని సవరిస్తారు. బీసీల కోసం సవరించరా..? అని వినోద్ కుమార్ నిలదీశారు.

## బ్రిటీష్ రాజకీయాల్లో 'ఇండియా' మోడల్..

న్యూఢిల్లీ,భారతదేశం రూపొందించిన ఆధార్ మోడల్ ఇప్పుడు ప్రపంచ దేశాలకు ప్రేరణగా మారింది. తాజాగా బ్రిటన్ రాజకీయాల్లోనూ అదే మోడల్ చర్చనీయాంశమైంది. యూకే ప్రధాని కీర్ స్టార్మర్ తన దేశంలో డిజిటల్ ఐడీ వ్యవస్థను ప్రవేశపెట్టే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందుకోసం ఆయన ఇటీవల భారత్ పర్యటన సందర్భంగా ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకనితో ప్రత్యేకంగా భేటీ కావడం ప్రత్యేక ఆసక్తికరంగా మారింది.

భారత ఆధార్ మోడల్‌కు ప్రేరణగా యూకే

భారతదేశంలో ఆధార్ వ్యవస్థ ద్వారా ప్రతీ పౌరుడి గుర్తింపు ఒక్క నంబర్ ద్వారా సాధ్యమైంది. ఈ సిస్టమ్ వల్ల ప్రజా సేవలు, సబ్సిడీలు, బ్యాంకింగ్, ఆరోగ్య సేవలు అన్నీ మరింత సులభతరం అయ్యాయి. ఈ మోడల్‌ను స్టడీ చేసిన స్టార్మర్, "ఇండియాలో ఇది హిట్ అయింది కాబట్టి, బ్రిటన్‌కూ ఇది ఉపయోగపడుతుంది" అని పేర్కొన్నారు.

డిజిటల్ ఐడీ కార్డులపై సీరియస్ ప్లాన్

స్టార్మర్ ప్రభుత్వం ప్రతీ పౌరుడికి డిజిటల్ ఐడీ కార్డు తప్పనిసరి చేయాలని భావిస్తోంది. ఈ కార్డు లేకుండా ఎవరూ పని చేయలేరని ఆయన ఇప్పటికే ప్రకటించారు. దేశంలో అక్రమంగా పనిచేసేవారిని అరికట్టడమే కాకుండా, అండర్‌గ్రౌండ్ ఎకానమీని కంట్రోల్ చేయడంలో ఇది సహాయపడుతుందని ఆయన అన్నారు. అంతేకాకుండా హెల్త్‌కేర్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ వంటి ప్రభుత్వ



సేవలను సులభంగా అందించడంలో ఇది కీలకమని చెప్పారు.

పౌర హక్కుల సంఘాల వ్యతిరేకత

అయితే బ్రిటన్‌లో ఈ ఆలోచనపై భారీ వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత బ్రిటన్ పౌరులకు తప్పనిసరి ఐడీ కార్డులు లేవు. ఇప్పుడు వాటిని మళ్లీ తీసుకురావడం వ్యక్తిగత స్వేచ్ఛపై దాడిగా పరిగణిస్తున్నారు. పౌర హక్కుల సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు ఇది ప్రైవసీకి ముప్పు అని తీవ్రంగా విమర్శిస్తున్నాయి.గతంలో మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ కూడా బయోమెట్రిక్ ఐడీ కార్డులు తీసుకురావడానికి ప్రయత్నించారు. కానీ ప్రజల వ్యతిరేకతతో ఆ ప్రాజెక్ట్ నిలిచిపోయింది. అయితే స్టార్మర్ మాత్రం ఈసారి తన ప్లాన్ తప్పక సక్సెస్ అవుతుందని నమ్ముతున్నారు.

## సంపాదకీయం

**శనివారం 11-10-2025**

# ప్రయాణ మార్గాల్లో సౌర ఫలకాలు

దేశ ఆర్థికాభివృద్ధిలో విద్యుత్ ప్రాధాన్యం ఎనలేనిది. అలాగని కరెంటు ఉత్పత్తికి విచ్చలవిడిగా శిలాజ ఇంధనాలను వినియోగిస్తే పర్యావరణానికి హాని కలుగుతుంది. ఈ నేపథ్యంలో పునరుత్పాదక ఇంధన వనరులపై ఎక్కువగా దృష్టి సారించాలి. రైల్వేపట్టాల మధ్యలో సౌర ఫలకాల ఏర్పాటు ద్వారా కరెంటు ఉత్పత్తికి అవకాశం ఉంది. ఈ విషయంలో ఇటీవల కీలక అడుగు పడింది. మొన్న ఆగస్టులో ఇండియన్ రైల్వేస్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో పైలట్ ప్రాజెక్టు కింద పట్టాల మధ్యలో 70 మీటర్ల పొడవున సౌర ఫలకాలు అమర్చింది. వాటి విద్యుదుత్పత్తి సామర్థ్యం 15 కిలోవాట్లు. తద్వారా దేశ ఇంధన రంగంలో సరికొత్త అధ్యాయానికి రైల్వే శాఖ నాంది పలికింది. పట్టాలకు మరమ్మతులు చేయాల్సి వస్తే ఈ సోలార్ ప్యానెళ్లను తొలగించి మళ్లీ అమర్చుకునే అవకాశం ఉంది. భారతీయ రైల్వేల వార్షిక వ్యయంలో ఇంధన ఖర్చుల వాటా సుమారు 14శాతం. సౌరవిద్యుత్తును అందిపుచ్చుకోవడం ద్వారా వచ్చే పదేళ్లలో రూ.41 వేల కోట్లు ఆదా చేయాలని ఎనిమిదేళ్ల క్రితమే రైల్వే శాఖ లక్షించింది. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి దాదాపు రెండున్నర వేల రైల్వేస్టేషన్లు, కార్యాలయాల పైకప్పులపై నెలకొల్పిన సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం 209 మెగావాట్లు. నిరుడు నవంబర్ నాటికి ఒక్క ఈశాన్య రైల్వేలోనే సౌర ఫలకాల ఏర్పాటు ద్వారా విద్యుత్ వ్యయంలో రూ.1.37 కోట్లు ఆదా చెయ్యగలిగారు. తాజా ప్రయోగం సత్ఫలితాలిస్తే దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే పట్టాల మధ్య నిత్యం పెద్దమొత్తంలో సౌరవిద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చు. తద్వారా రైల్వేకు విద్యుత్ ఖర్చులు బాగా కలిసొస్తాయి. దీనికి తోడు జాతీయ రహదారుల మీదా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేస్తే మరింత సౌరశక్తిని ఒడిసిపట్టవచ్చు.

### భారీగా విద్యుదుత్పత్తికి అవకాశం

సౌర ఫలకాలు నెలకొల్పడం ద్వారా అహ్మదాబాద్-రాజకోట్ జాతీయ రహదారిపై 104 మెగావాట్లు, అహ్మదాబాద్-వడోదర రోడ్డుపై 61 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చని గుజరాత్ ఎనర్జీ రీసెర్చ్ అండ్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ తన అధ్యయనంలో వెల్లడించింది. రహదారుల పక్కన పిల్లర్లు నిర్మించి వాటిపై గొడుగులాగా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయవచ్చు. దాదాపు లక్షన్నర కిలోమీటర్ల పొడవున్న మన జాతీయ రహదారులపై 95 గిగావాట్ల దాకా సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. వీలును బట్టి రాష్ట్ర, స్థానిక రహదారులపైనా దీన్ని పరిశీలించవచ్చు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో నిర్మించిన రాష్ట్ర జిల్లా రహదారుల్లో కాంట్రాక్టర్లకు తగినంత టోల్ రుసుము లభించట్లేదు. వీటిపై ఉత్పత్తి అయిన సౌర విద్యుత్తును ఎలక్ట్రిక్ వాహనాలు, ఇతర అవసరాలకు విక్రయిస్తే వారికి లాభదాయకమవుతుంది. అందుకోసం ఛార్జింగ్ పాయింట్ల నిర్మాణం, ఇతర ఏర్పాట్లకు తగిన విధివిధానాలు రూపొందించాలి. అదే సమయంలో ధరలు అందుబాటులో ఉండేలా చూడాలి. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

### లక్ష్యం నెరవేరాలంటే...

ఈ ఏడాది ఆగస్టు నాటికి మన దేశ మొత్తం విద్యుదుత్పత్తి సామర్థ్యం 496 గిగావాట్లు. ఇందులో పునరుత్పాదక ఇంధన వనరుల వాటా 49శాతం. గృహాలు, కార్యాలయాల్లో ఏసీల వినియోగం, పారిశ్రామిక అవస రాలు, ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకొనేకొద్దీ విద్యుత్ అవసరం పెరుగుతూనే ఉంటుంది. బొగ్గు వంటి శిలాజ ఇంధనాల ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేస్తుండటం వల్ల పర్యావరణం దెబ్బతింటోంది. దాంతో వాతావరణ మార్పులు చోటుచేసుకుని అనేక అనర్థాలు సంభవిస్తున్నాయి. దీన్ని నివారించేందుకు 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం సాధించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో సౌరశక్తి కీలక పాత్ర పోషిస్తుంది. ఈ సంవత్సరం ఆగస్టు నాటికి స్థాపిత సౌరవిద్యుత్తు సామర్థ్యం 116 గిగావాట్లు.రైల్వే లైన్లు, రహదారులపై సౌర ఫలకాలు ఏర్పాటు చేస్తే సోలార్ పవర్ ఇంకా ఎక్కువగా అందుబాటులోకి వస్తుంది. ఆ మేరకు శిలాజ ఇంధనాల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవచ్చు. దానివల్ల చమురు దిగుమతులు తగ్గి, విదేశ మారకద్రవ్యం ఆదా అవుతుంది. కాలుష్యానికి అవకాశం లేని సౌర విద్యుత్ వాడకం వల్ల దేశీయంగా కర్బన ఉద్గారాలు గణనీయంగా తగ్గుతాయి. తద్వారా 2070 నాటికి కర్బన ఉద్గారాల తటస్థత సాధించాలన్న భారతదేశ లక్ష్యం నెరవేరుతుంది. రైల్వే బాటలోనే నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సైతం సోలార్ విద్యుదుత్పత్తికి నడుంకట్టాలి.

# నోబెల్‌పై వీడని ట్రంప్ వ్యామోహం

వాషింగ్టన్:అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈసారి నోబెల్ శాంతి బహుమతి ఎలాగైనా పొందాలన్న ఆకాంక్షతో చాలాకాలంగా నిరీక్షిస్తున్నారు. వారం రోజుల క్రితం ఈ బహుమతిపై మాట్లాడుతూ అక్టోబర్ 10న తనకు నోబెల్ శాంతి బహుమతి రాకుంటే తమ దేశం అమెరికాకే ఘోర అవమానంగా ఆయన వ్యాఖ్యానించడం చర్చనీయాంశం అవుతోంది. గతంలో పలువురు నాయకులు, సంస్థలు ట్రంప్ పేరును నోబెల్ బహుమతికి నామినేట్ చేశారు. 2020 లో బైడెన్ వారసురాలు కమలా హారిస్ అధ్యక్షురాలు అవుతుందని చెప్పినప్పుడు అది అమెరికాకే పెద్ద అవమానమని ట్రంప్ ఎద్దేవా చేశారు. ఎందుకు ట్రంప్ నోబెల్ శాంతి బహుమతిని కోరుతున్నారో విచిత్రంగా ఉంది. ఇంతవరకు నోబెల్ శాంతి బహుమతి గ్రహీతలంతా దానికి అనర్హులేనని, కేవలం సందేహాస్పద విధానాల ద్వారానే ఎంపికయ్యారన్న అపోహ ట్రంప్‌లో గూడుకట్టుకుంది. శాంతి అహింసలే ఆయుధంగా స్వాతంత్ర్య పోరాటం సాగించిన మహాత్మాగాంధీకి నోబెల్ శాంతి బహుమతి ప్రదానం చేసినట్టయితే ఆయన ఆత్మ ఎంతో కృతజ్ఞత వెల్లడించేది.కానీ ఆయనకు శాంతి బహుమతి రాలేదు. ఆ తరువాత కాలంలో హెన్రీ కిసింజర్‌కు, అంగసాన్ సూకీలకు నోబెల్ బహుమతి లభించింది. హెన్రీ కిసింజర్ వియత్నాం యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగేలా చేయడంతో పాటు కాంబోడియా, లావోస్‌లలో బాంబుల దాడిలో ఆయన హస్తం పరోక్షంగా ఉంది. అంగ్‌సాన్ సూకీ తన సైనిక దళాలు రోహింగ్యాలను హింసించడాన్ని సమర్థించింది. ఒబామా గత రెండు దశాబ్దాలుగా ఎలాంటి అద్దె చెల్లించకుండా నివాసంలో ఉంటున్నాడని ట్రంప్ ఆరోపిస్తున్నారు. అలాగే అమెరికా దేశాధ్యక్షుడుగా ఉన్న కాలంలో అంతకు ముందటి దేశాధ్యక్షుడు బుష్ సైనిక వాదాన్ని తిరస్కరించడానికి ప్రేరేపించాడు. అంతకు తప్ప మరేమీ చేయని ఒబామా 2009 లో పదవీ బాధ్యతలు చేపట్టిన తొమ్మిది నెలల్లోనే నోబెల్ శాంతి బహుమతి వచ్చినప్పుడు తాను అంతకుమించి ఎన్నో చేశానని తనకెందుకు రాకూడదని ట్రంప్ వాదిస్తున్నారు. భారత్ పాకిస్థాన్ మధ్య ఆపరేషన్ సిందూర్ పేరున జరిగిన యుద్ధంతోసహా ఏడు యుద్ధాలను ఆపానని ట్రంప్ చెప్పుకొచ్చారు. వాస్తవానికి ట్రంప్ ఎంత మొత్తుకున్నా ఇజ్రాయెల్ దాడి గాజాపై ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. అలాగే ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం కొనసాగుతూనే ఉంది. తన దౌత్యం వల్లనే భారత్, పాకిస్థాన్ దేశాలకు వాణిజ్య ఒప్పందాల ఆశ చూపి యుద్ధాన్ని ఆపించానని ట్రంప్ పదేపదే చెప్పుకోవడాన్ని భారత ప్రధాని మోడీతోసహా భారతీయ దౌత్యవేత్తలు పలుసార్లు ఖండించడం జరిగింది.భారత్ పాక్ ద్వైపాక్షిక నిర్ణయం తప్ప మూడో దేశం జోక్యం తాము అంగీకరించేది లేదని భారత్ స్పష్టం చేసింది. అయితే పాకిస్థాన్ మాత్రం నోబెల్ బహుమతికి ట్రంప్ అర్హుడని సమర్థిస్తోంది. అబ్రహాం అకార్డ్ అనే ఒప్పందం ఇజ్రాయెల్, అరబ్ ఎమిరేట్స్, బహ్రెయిన్, సుడాన్, మొరాకో వంటి అరబ్ దేశాల మధ్య జరిగింది. 1994లో జోర్డాన్‌తో ఇజ్రాయెల్ ఒప్పందం కుదుర్చుకున్న తరువాత ఒక అరబ్ దేశంతో ఒప్పందం చేసుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ ఒప్పందం 2020 సెప్టెంబర్ 15న వాషింగ్టన్ డీసీ లోని వైట్‌హౌస్‌లో ట్రంప్ సమక్షంలో జరిగింది. ఇది మధ్యప్రాచ్యంలో శాంతికి కీలకమైన ఒప్పందంగా ట్రంప్ ప్రచారం చేసుకుంటున్నారు. ఉత్తర



కొరియాలో జిమ్మీకార్టర్, బిల్ క్లింటన్ మాజీ అధ్యక్షులుగా పర్యటించిన తరువాత ట్రంప్ ఆ దేశంలో పర్యటించారు. రెండుసార్లు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో సమావేశమైనా అణు నిరాయుధీకరణ ప్రాంతంగా ఉత్తర కొరియాను చేయాలన్న లక్షం నెరవేరలేదు. కానీ శాంతి ప్రయత్నాలు చేశానని ట్రంప్ గొప్పగా చెప్పుకొచ్చారు. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పుతానన్న హామీతో అధికారం లోకి వచ్చిన ట్రంప్ మొదటి ఆరు నెలల్లోనే యుద్ధోన్మాదిగా మారారు. ఇజ్రాయెల్ యుద్ధాన్ని అమెరికా యుద్ధంగా మార్చేసిన ట్రంప్ ఇప్పుడు శాంతి సూత్రాల ప్రణాళికను తెరపైకి తీసుకు వస్తున్నారు.కొన్ని నెలల క్రితం అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడు బడ్డీ కార్టర్ ట్రంప్ పేరును నోబెల్‌కు ప్రతిపాదిస్తూ నార్వేలోని నోబెల్ కమిటీకి లేఖ రాశారు. పాకిస్థాన్ ప్రభుత్వం కూడా ట్రంప్ పేరును ప్రతిపాదించింది. ఇప్పుడు నోబెల్ కమిటీ వామపక్ష, ఉదారవాదుల పట్ల సానుకూల ధోరణితో ఉంటున్నదని, తన లాంటి సంప్రదాయ, జాతీయవాదుల విషయంలో వ్యతిరేకంగా ఉంటున్నారని ట్రంప్ ఆరోపిస్తున్నారు. శాంతిని, ప్రజాస్వామ్యాన్ని, మానవహక్కుల పరిరక్షణ కోసం నిరంతరం శ్రమించిన ప్రముఖులకే ఇంతవరకు నోబెల్ శాంతి బహుమతి వరించింది. 1906లో నాటి అమెరికా అధ్యక్షుడు థియోడర్ రూజ్‌వెల్టు రష్యా జపాన్ యుద్ధం ముగింపునకు కృషి చేసినందుకు, 1919 లో అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత ప్రపంచ శాంతి కోసం లీగ్ ఆఫ్ నేషన్స్ స్థాపించినందుకు చేసిన కృషికి నోబెల్ శాంతి బహుమతి వరించింది. 2002 లో జిమ్మీకార్టర్ అంతర్జాతీయ వివాదాలకు శాంతియుత పరిష్కారాల కోసం కృషి చేసినందుకు నోబెల్ బహుమతి లభించింది. 2009 లో ఒబామా అణు నిరాయుధీకరణకు అంతర్జాతీయ దౌత్యంలో కీలక పాత్ర వహించినందుకు నోబెల్ సాధ్యమైంది. వీరితోపాటు 2007 లో అమెరికా ఉపరాష్ట్రపతిగా పనిచేసిన అల్‌గోర్‌కు కూడా వాతావరణ మార్పులపై అవగాహన పెంపొందించినందుకు ఈ అవార్డు దక్కింది. వీరితోపాటు తాను కూడా అంతర్జాతీయ దౌత్య ఒప్పందాలు, శాంతి స్థాపనకు ఎంతో కృషి చేశానని, అందుకే నోబెల్ శాంతి బహుమతి తనకే దక్కాలని ట్రంప్ వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి నోబెల్ బహుమతి ఎవరిని వరిస్తుందో చూద్దాం.

# వ్యాపార వర్గాల్లో కలకలం రేపుతున్న చర్చ

విజయవాడ,వ్యాపార సంస్థలపై ఆదాయపుపన్నుశాఖ అధికారుల దాడులు వ్యాపార వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. గుంటూరు నగరంలోని కందిపప్పు కమిషన్ ఏజెంట్ వెంకటేశ్వరరావు నివాసంలో ఆదాయ పన్నుశాఖ అధికారుల తనిఖీలు రెండో రోజూ కొనసాగాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో కందిపప్పు సరఫరా కాంట్రాక్టు పొందిన వెంకటేశ్వరరావు.. ఆదాయపన్ను చెల్లించలేదు. 30 ఏళ్లుగా కమిషన్ వ్యాపారంతోపాటు రియల్ ఎస్టేట్, బంగారం వ్యాపారం చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ దుకాణంలో ఐటీ సోదాలు నిర్వహించగా.. గుంటూరు, విశాఖపట్నంలోని కమిషన్ ఏజెంట్లకు పెద్ద మొత్తాల్లో బంగారు బిస్కెట్లు అమ్మినట్లు తేలింది. దీంతో అప్రమత్తమైన అధికారులు విజయవాడలోని ఐటీ దర్యాప్తు విభాగం ఆధ్వర్యంలో 30 బృందాలుగా ఏర్పడి గుంటూరు, విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం, వినుకొండ ప్రాంతాల్లోని దాల్ మిల్లు వ్యాపారుల ఇళ్లు, వ్యాపార ప్రాంతాల్లో సోదాలు చేస్తున్నారు. గుంటూరు దర్గారోడ్డులోని ఓ బహుళ అంతస్తుల సముదాయంలోని వెంకటేశ్వరరావు ప్లాట్‌లో బుధవారం సోదాలు కొనసాగించారు. గుంటూరులోని కమిషన్ ఏజెంట్ సంస్థపై నిర్వహించిన తనిఖీల్లో కీలక సమాచారం లభ్యమైంది. కందిపప్పు, పచ్చిపప్పు వ్యాపారంతోపాటు రూ.కోటి, రూ.2 కోట్ల విలువైన చిట్టీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇంత పెద్ద మొత్తాల్లో చిట్టీలు వేసేవారి పేర్లు, వివరాల్ని అధికారులు సేకరిస్తున్నారు. వెంకటేశ్వరరావు నుంచి సరకులు కొనుగోలు చేసిన ఏపీ, తెలంగాణ, తమిళనాడు రాష్టాల్లోని మిల్లర్ల వివరాల్ని అధికారులు పరిశీలిస్తున్నారు. త్వరలోనే ఆ మిల్లుల ఖాతా పుస్తకాల్ని తనిఖీ చేయనున్నారు. అలాగే వైజాగ్‌లోని కమిషన్ ఏజెంట్ ఇంట్లోనూ తనిఖీలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎంతమందికి సరకులు సరఫరా చేశారు.. ఏమేరకు లెక్కల్లో చూపారనే అంశాలను ఐటీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కమిషన్ ఏజెంట్లు బ్యాంకుల్లో జరిపిన వ్యాపార లావాదేవీల వివరాలు, లాకర్లలో భద్రపరచిన బంగారం, ఆస్తుల వివరాల్ని సేకరించారు. వీరికి బినామీలుగా ఉన్నవారి వివరాల్ని సైతం రాబట్టారు. తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. వైజాగ్‌లోని కమిషన్ ఏజెంట్ నాలుగు అంతస్తుల భవనంలో ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తూ రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు విలువ చేసే ఖరీదైన శుభలేఖల్ని ముద్రిస్తున్నట్లు గుర్తించారు. సదరు వ్యాపారి బంగారం, వెండి, ఎలక్ట్రానిక్ వస్తువులు, సిమెంటు, ఫర్నీచర్ వ్యాపారాలు చేస్తున్నారు. ప్రభుత్వ కాంట్రాక్టులు చేసే వారికి పెట్టుబడులు పెడుతున్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. ఆయా వ్యాపారాల్లో జరిపిన లావాదేవీలకు ఏమేరకు జీఎస్టీ చెల్లించారు..? ఐటీ రిటర్న్‌ల వివరాల్ని అధికారులు సేకరిస్తున్నారు.

# గంగపుత్రుల ఘోష...



అమరావతి,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనిత సొంత నియోజకవర్గాల్లో గంగపుత్రులు ఆగ్రహించారు. దీనికి ప్రధాన కారణం పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యం. తమ ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందనే అభద్రతా భావం. ఇలాంటి పరిస్థితుల్లో గంగపుత్రులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఉప్పాడ వద్ద పరిశ్రమల వ్యర్థాలతో సముద్రం కలుషితం అవుతున్నదని, ఒ.ఎన్.జి.సి కార్యకలాపాల వల్ల వేటకు ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తూ వారు రోడ్ల మీదకు వచ్చారు. ఇటు అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో కాలుష్యకారకమైన బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ నిరసన తెలియచేస్తున్న మత్స్యకారులు హోంమంత్రిని నిలదీయాల్సి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా తీర ప్రాంతాన్ని కాలుష్య ప్రాంతంగా మార్చటం పర్యావరణానికి తీవ్ర ప్రమాదం. మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోతుంది. భూగర్భ జలాలు కలుషితమౌతాయి.పెట్టుబడులకు సింగిల్ విండో పథకం ద్వారా అనుమతులు ఇస్తున్నారు. దీనితో పెట్టుబడిదారులు ముఖ్యంగా ఫార్మా కంపెనీలు ఈ ప్రాంతంలో విస్తరిస్తున్నాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారు. తీర ప్రాంత మత్స్యకారులు ఉపాధి లేక వలస బాట పడుతున్నారు.అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో 'బల్క్ డ్రగ్ పార్క్ వద్దు, గంగమ్మ తల్లి ముద్దు' అంటూ స్థానిక మత్స్యకారులు, ప్రజలు గత 25 రోజుల నుండి నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. బల్క్‌డ్రగ్ పార్క్ కోసం 2025 ఆగస్టు 6న పోలీసుల నిర్బంధంతో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేసి, గృహ నిర్బంధాలు ప్రయోగించారు. అయినప్పటికీ స్థానిక టిడిపి, జనసేన, వైసిపి పార్టీల శ్రేణులు, సాంప్రదాయ మత్స్యకారులు పాల్గొని ముక్త కంఠంతో వ్యతిరేకించారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా బల్క్ డ్రగ్ పార్కుకు కావలసిన రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు చేపట్టింది. దీంతో ఆగ్రహించిన మత్స్యకారులు నిరసనకు దిగారు. పోలీసులు మొదట అనుమతి ఇవ్వలేదు. మండుటెండల్లోను తమ గ్రామంలో కాలుతున్న ఇసుకలో కూర్చొని పట్టుదలగా గొడుగులతో నిరసన కార్యక్రమం మొదలుపెట్టారు. వారి పోరాటానికి అన్ని పక్షాలవారు మద్దతు తెలపడంతో టెంట్ వేసుకోవడానికి పోలీసులు అనుమతులు ఇచ్చారు. శాంతియుతంగా నిరసన చేపడుతున్నారు.ఇంతలోనే బల్క్ డ్రగ్ పార్కు సమీపంలో ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం ప్రజాభిప్రాయ సేకరణకు శ్రీకారం చుట్టారు. దీనితో స్థానిక మత్స్యకారులు పోరాటాన్ని ఉధృతం చేశారు. చివరికి, 'సెప్టెంబర్ 30న వచ్చి మీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాన'నే వీడియో సందేశాన్ని హోం మంత్రి ప్రజలకు పంపించారు. దీనితో మత్స్యకారులు తమ సమస్య పరిష్కారం అవుతుందని ఎదురు చూశారు. ఒకరోజు ముందుగానే సెప్టెంబర్ 29న హోం మంత్రి రాజయ్యపేటలో మత్స్యకారులు చేస్తున్న దీక్షా శిబిరం వద్దకు చేరుకొని%ౌ%దసరా తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వద్దకు తీసుకెళ్తానని, ఒక కమిటీగా ఏర్పాటు కావాలని సూచించారు. దీనితో అసంతృప్తిగా ఉన్న మత్స్యకారులు తీవ్ర నిరసన తెలియజేశారు. మంత్రి ప్రతిపాదనను స్థానిక ప్రజలు ఎవరూ అంగీకరించలేదు. ప్రజల నుండి తీవ్ర నిరసనను ఎదుర్కొనవలసి వచ్చింది. దీనితో హోం మంత్రి ఒక మెట్టు దిగి పనులు నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించాల్సి వచ్చింది. ఇది తాత్కాలికమైన ప్రకటన అని స్థానిక మత్స్యకారులకు అర్థమైంది. రాష్ట్ర మంత్రుల నియోజకవర్గాల్లోనే ఇలా వుంటే మిగతా చోట్ల పరిస్థితి ఎలా వుంటుందో అర్థం చేసుకోవచ్చు.మత్స్య సంపదను అభివృద్ధి చేసేందుకుగాను ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే నెలలో 45 రోజులు పాటు హాలిడే ప్రకటిస్తారు. అలాంటిది 365 రోజులూ పరిశ్రమలు ఉండి, సముద్రం విషతుల్యంగా మారితే తమ జీవన పరిస్థితి ఏమిటనే ఆందోళన వారికి వుంది. ఇప్పటికే హెటిరో మందుల కంపెనీ వల్ల ఈ ప్రాంత మత్స్యకారులకు సముద్రంలో వేట జరగక వలసలు పోయి పస్తులుంటున్నారు. అలాంటిది 'రేపు బల్క్ డ్రగ్ పార్క్ వస్తే మా జీవితాలకు భద్రతత ఏమిట'ని మత్స్యకారులు కుమిలిపోతున్నారు.గత ఎన్నికల ముందు రాజయ్యపేట గ్రామాన్ని సందర్శించిన వంగలపూడి అనిత విషతుల్య పరిశ్రమలకు తాను వ్యతిరేకమని తెలిపారు. హెటిరో పైప్‌లైన్ వేయడంతో చేపలు చనిపోతున్నాయని, 13 సంవత్సరాల పిల్లల నుండి పెద్ద వయస్సువారి వరకు అనేక వ్యాధులతో బాధపడుతున్నారని ఆమె అన్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తులు, చర్మవ్యాధులు, కిడ్నీ, క్యాన్సర్ వంటి వ్యాధులు రావడానికి ప్రధాన కారణం హెటిరో డ్రగ్ కాలుష్యమని స్వయంగా ఒప్పుకున్నారు. గ్రామ సభలు పెట్టకుండా, ప్రజల ఆమోదం లేకుండా బల్క్‌డిగ్ కంపెనీకి అనుమతులు ఇవ్వబోమని వాగ్దానం చేశారు. ఏవైనా డబ్బులిచ్చి కొనుగోలు చేయగలంగాని, ప్రాణాలను కొనలేమన్నారు. పోరాటాలతోనే రాజయ్యపేటను రక్షించుకోవాలని నాడు హితవు పలికారు. దీంతో అత్యంత విశ్వాసంతో అత్యధిక మెజారిటీతో కూటమిని గెలిపిస్తే%ౌ%నేడు కూటమి ప్రభుత్వం దానికి భిన్నంగా చర్యలు తీసుకోవడంతో మత్స్యకారులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.బల్క్ డ్రగ్ పార్క్‌కు 1270 ఎకరాల భూమి కావాల్సి ఉంది. ఇందులో 450 ఎకరాల భూములు మాత్రమే ప్రభుత్వం సేకరించింది. ఇంకో 820 ఎకరాలు భూములను సేకరించాల్సి వుంది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీతో వర్చువల్‌గా శంకుస్థాపన చేయించింది. ఆ రోజున గ్రామ ప్రజలను పోలీసులు నిర్బందించారు. పోలీసు నిర్బంధాన్ని అధిగమించిమరీ ప్లేట్లు పట్టుకొని నిరసన తెలియజేశారు. ప్రభుత్వం ఆగకుండా నిర్మాణ పనులు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుండి చట్టాన్ని గౌరవించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నది. పోలీసులు కూడా అత్యుత్సాహంతో అక్రమ కేసులు బనాయిస్తున్నారు. అయినప్పటికీ ఆత్మస్థైర్యం కోల్పోకుండా ప్రజలు పోరాటం కొనసాగిస్తున్నారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం 2020 మార్చి 20న ప్రమోషన్ ఆఫ్ బల్క్‌డ్రగ్ పార్క్ పథకాన్ని ఆమోదించింది. హిమాచల్‌ప్రదేశ్ ఉనా జిల్లా హరోలిలో, గుజరాత్ భరూచ్ జిల్లా జంబుసర్‌లో, ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ తొండంగిలో మొదటి దశ ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా కాకినాడ ప్రజలు పోరాటం చేయడం వల్ల నేడు నక్కపల్లి ప్రాంతం రాజయ్యపేటలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. దీనిని స్థానిక మత్స్యకారులు, ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలకు పోకుండా పర్యావరణాన్ని నాశనం చేసి ప్రజల జీవనానికి తీవ్ర విఘాతం కలిగించే బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలి.

## రెండో భార్యను హత్యచేసిన దుండుగుడు

రంగారెడ్డి,రంగారెడ్డి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. భార్యను భర్త కిరాతకంగా హతమార్చాడు. చేవెళ్ల మండలం వెంకన్నగూడలో ఈ ఘటన జరిగింది. వెంకన్నగూడకు చెందిన వానరాశి జంగయ్య హైదరాబాద్‌లో డ్రైవింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య ఉండగానే 15 ఏళ్ల క్రితం రజిత అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. మూడేళ్ల క్రితం భర్త నుంచి రజిత విడిపోయింది. మొదటి భార్యతో వెంకన్న ఉంటున్నాడు. రజిత ఆచూకీ తెలుసుకుని సోమవారం ఆమెను వెంకన్నగూడకు తీసుకొచ్చాడు.

# ఎలా సాధ్యమైంది?

హైదరాబాద్,కాంగ్రెస్‌లో ఏ విషయమైనా అంత తేలిగ్గా తేలదు. వడపోతలు ఎక్కువగా ఉంటాయి. కానీ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విషయంలో హైకమాండ్.. ఫటాఫట్ తేల్చేసింది. కారణం రేవంత్ రెడ్డే. ఆశావహుల్లో హేమాహేమీలు ఉండగా.. నవీన్ యాదవ్‌కే టికెట్ ఎందుకిచ్చారు?జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు తమ అభ్యర్థిగా వి.నవీన్ యాదవ్‌ను కాంగ్రెస్ ప్రకటించడం రాజకీయ వర్గాల్లో సంచలనం రేపింది. 41 ఏళ్ల వయస్సున్న ఈ బీసీ నేత, గతంలో MIM టికెట్‌పై 2014లో, స్వతంత్రంగా 2018లో పోటీ చేసి మంచి ఓటు బ్యాంకును సంపాదించాడు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ యువకుడికి ప్రాధాన్యం ఇవ్వడం, పార్టీలోని సీనియర్ నాయకుల్ని పక్కకు పెట్టడం హాట్ టాపిక్ అయ్యింది. టీమిండియా మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్, బొంతు రామ్మోహన్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, సీఎన్ రెడ్డి, పీజేఆర్ కూతురు విజయా రెడ్డి వంటి కీలక నాయకులను ఫిల్టర్ చేసి.. వాళ్లెవరినీ కాకుండా.. ఓ కుర్రాడికి టికెట్ ఇప్పించడం ద్వారా రేవంత్ రెడ్డి.. పార్టీలో తన పట్టును మరోసారి నిరూపించుకున్నారనేది విశ్లేషకులు అంచనా.ఈ నిర్ణయం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదంతో జరిగింది. ఐతే.. అభ్యర్థి ఎవరైనా గెలిపించే బాధ్యత అంతిమంగా రేవంత్‌పై ఉంటుంది కాబట్టి.. ఆయన నిర్ణయాన్ని హైకమాండ్ ఫైనల్ చేసింది. నవంబర్ 11న జరిగే ఈ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే నవీన్ యాదవ్ కార్యాలయంలో ఉత్సవాలు జరిగాయి. పార్టీ కార్యకర్తలు అతన్ని అభినందిస్తూ, జూబ్లీహిల్స్‌లో విజయం ఖాయమని ధైర్యంగా చెప్పుకున్నారు. రేవంత్ రెడ్డి కొన్ని రోజులుగా సీనియర్ నాయకులతో వర్చువల్ సమావేశాలు నిర్వహించారు. అయినప్పటికీ నవీన్ యాదవ్‌ను మాత్రమే ఎంపిక చేశారు. అజారుద్దీన్‌లాంటి జాతీయ స్థాయి నేత, జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ పీసీసీ లీడర్ కుమార్తెగా ప్రభావవంతమైన విజయా రెడ్డి, బలమైన కుటుంబ నెట్‌వర్క్ ఉన్న అంజన్ కుమార్ యాదవ్ వంటి స్థానిక నాయకుల్ని పక్కన పెట్టడంపై పార్టీలో అసంతృప్తిని ఉన్నప్పటికీ, రేవంత్ రెడ్డి తన నిర్ణయంలో దృఢంగా ఉన్నారు.

### అసలు నవీన్ యాదవ్ ఎవరు?:

జూబ్లీహిల్స్‌లో బలమైన మార్క్ వేసుకున్న ఈ యువ నేత, 2014లో MIM టికెట్‌పై పోటీ చేసి 41,656 ఓట్లతో రెండో స్థానంలో నిలిచాడు. 2018లో బీఆర్ఎస్ హవా ఉన్నప్పుడు స్వతంత్ర అభ్యర్థిగా దిగి 18,817 ఓట్లు (12.2 శాతం) సంపాదించి మూడో స్థానంలో నిలిచాడు. ఈ రికార్డు ఆధారంగానే రేవంత్ రెడ్డి ఇతన్ని ఎంపిక చేసినట్టు సమాచారం. అయితే, నవీన్ యాదవ్‌కి వివాదాస్పద నేతగా కూడా పేరుంది. ఉపఎన్నికల ముందు తప్పుడు ఓటర్ ఐడీ కార్డులు పంపిణీ చేసిన ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయం పార్టీలో కొంత చర్చనీయాంశమైనప్పటికీ, కాంగ్రెస్ హైకమాండ్ దీన్ని పక్కకు పెట్టి అతనికి ఆమోదం తెలిపింది.ఈ నిర్ణయం తెలంగాణ కాంగ్రెస్‌లో యువతకు ప్రాధాన్యం ఇచ్చే సంకేతంగా కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి తన పొలిటికల్ స్ట్రాటజీలో యంగ్ బ్లడ్‌ను ప్రోత్సహించడం ద్వారా పార్టీలో కొత్త ఊపిరి పోస్తున్నారు. జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం తర్వాత ఖాళీ అయిన ఈ స్థానానికి బీఆర్ఎస్.. ఆయన భార్య మాగంటి సునీతను అభ్యర్థిగా నిలబెట్టింది. బీజేపీ ఇంకా అభ్యర్థిని డిసైడ్ చెయ్యలేదు. కానీ బలమైన అభ్యర్థిని నిలబెట్టే ఆలోచనలో ఉంది. అయినప్పటికీ కాంగ్రెస్ 25,000 మెజారిటీతో గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. నవీన్ యాదవ్ యూత్ కోఆర్డినేటర్‌గా స్థానిక సమస్యలపై పనిచేసి పాపులర్ అయ్యాడు. అతని డోర్ టు డోర్ క్యాంపెయిన్, కమ్యూనిటీ సర్వీసెస్ ద్వారా ఓటర్లతో బాండ్ ఏర్పరచుకున్నాడు.కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య ఉత్సాహం ఎక్కువగా ఉంది. "నవీన్ అన్నను ఎవరైనా గెలిపిస్తారు" అంటూ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. ఈ ఉప ఎన్నిక తెలంగాణలో కాంగ్రెస్ బలాన్ని పరీక్షించే అవకాశంగా మారింది. రేవంత్ రెడ్డి నిర్ణయం సరైనదేనా, లేక సీనియర్ల అసంతృప్తిని పెంచుతుందా అనేది రానున్న రోజుల్లో తేలనుంది. జూబ్లీహిల్స్ వైవిధ్యమైన వోటర్ బేస్‌తో కూడిన ఈ కాన్స్టిట్యూయెన్సీలో నవీన్ యాదవ్ విజయం సాధిస్తాడని పార్టీ నమ్మకంగా ఉంది. ఆయన గెలవకపోతే, రేవంత్ రెడ్డికి సీనియర్ల నుంచి వ్యతిరేక స్వరాలు పెరిగే అవకాశాలు ఉంటాయనుకోవచ్చు.

# డేంజర్ గేమ్‌కు తెరతీసిన పాకిస్తాన్.. నిశితంగా గమనిస్తున్న భారత్



న్యూఢిల్లీ,ఆపరేషన్ సిందూర్‌తో చావు తప్పి కన్ను సొట్టబోయిన చందంగా మారింది పాకిస్తాన్. అయినా పిచ్చి ప్రేలాపనలు మాత్రం తగ్గించడం లేదు. ఇటీవల అమెరికా సహకారం పెరిగింది. దీంతో పాకిస్తాన్ మరింత రెచ్చిపోతోంది. ఈ క్రమంలో ఇజ్రాయెల్ ఖతార్‌లోని హమాస్ సమావేశంపై డ్రోన్ దాడి చేయడం పాకిస్తాన్‌కు కలిసి వచ్చింది. ఈ క్రమంలో ఇస్లామిక్ దేశాలను ఏకతాటిపైకి తీసుకురావాలని పాకిస్తాన్ ప్రయత్నం ప్రారంభించింది. ఇస్లామిక్ నాటో ఏర్పాటు దిశగా కసరత్తు చేస్తోంది.పాకిస్తాన్ ఇటీవల 57 ఇస్లామిక్ దేశాలను ఒక మిలటరీ కూటమిగా మార్చే ప్రణాళికలో కసరత్తు వేగవంతం చేసింది. ఉద్దేశ్యం – ఏ ఇస్లామిక్ దేశం పై దాడి జరిగినా మిగతా దేశాలు కలిసి సైనిక చర్యలు చేపట్టడం. ఇది నాటో ఒప్పందంలోని ఆర్టికల్ 5 సూత్రానికి ప్రతిరూపం.

ఇప్పటికే ఉన్న సైనిక ఒప్పందాలు

పాకిస్తాన్ ఇప్పటికే తుర్కియే, అజర్‌బైజాన్‌తో సైనిక సహకార ఒప్పందాలు కలిగి ఉంది. సెప్టెంబర్ 17, 2025న సౌదీ అరేబియాతో డిఫెన్స్ ఒప్పందం చేసుకుంది. తాజాగా సోమాలియాతో ఐదేళ్ల వ్యూహాత్మక, మిలటరీ సహకార ఒప్పందం. సోమాలియా ఉన్న హార్న్ ఆఫ్ ఆఫ్రికా ప్రాంతం ప్రపంచంలో ఆయిల్ ఎగుమతి ప్రధాన కేంద్రం. దీంతో ఇది పాకిస్తాన్‌కు అనుకూలంగా మారనుంది.

కూటమి నేపథ్యం

గత ఏడాది నుంచి ఇజ్రాయెల్ చేసిన చర్యలు అరబ్ ప్రపంచంలో భయాందోళనను పెంచాయి.

– 2024 జూలై – ఇరాన్ కొత్త ప్రధాని ప్రమాణస్వీకార వేళ హమాస్ నేత వద్దకు డ్రోన్ దాడి.

– 2024 సెప్టెంబర్ –దక్షిణ లెబనాన్‌లో హెజ్‌బుల్లా కమ్యూనికేషన్ పరికరాలపై దాడి.– 2025 – యెమెన్‌లో హూతీలపై ఎయిర్‌స్ట్రైక్స్.

– 2025 సెప్టెంబర్ 9 – ఖతార్‌లో హమాస్ నాయకులపై దాడి.

ఈ పరిణామాలు ఇస్లామిక్ దేశాల మధ్య రక్షణ సహకార ఆలోచనకు బీజం వేశాయి.

పాకిస్తాన్ వ్యూహాత్మక ప్రయోజనాలు

ఇస్లామిక్ నాటో ఏర్పడితే పాకిస్తాన్‌కు చాలా లాభం. ఇదే సమయంలో పాకిస్తాన్ అణ్వాయుధ సామర్థ్యం కలిగిన ఏకైక ఇస్లామిక్ దేశం. రక్షణ బడ్జెట్‌లో అధిక స్థానం. సౌదీ, తుర్కియే రక్షణ బడ్జెట్ కూడా ఎక్కువే. ప్రపంచ 40% ఇంధన ఉత్పత్తి ఇస్లామిక్ దేశాల్లో ఉండటం వల్ల ఆర్థిక ప్రభావం. కూటమి ఏర్పడితే ఆయిల్, గ్యాస్ కన్సార్టియం ద్వారా ప్రపంచ ఆర్థిక సమీకరణలో ప్రాధాన్యం పెరగడం.

భారత్‌కు భద్రతా లెక్కలు

ఈ కూటమి ఏర్పడితే తొలి ప్రతిస్పందన ఇజ్రాయెల్‌కు. అయితే ఆపరేషన్ 'సిందూర్' వంటి పరిస్థితులు పునరావతమైతే భారత్‌తోనూ ఘర్షణ అవకాశాలు. భారత్ ఇప్పటికే పాకిస్తాన్–తుర్కియే సహకారం పై అప్రమత్తంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో తుర్కియే డ్రోన్లతో, సైనికులతో సహాయం చేసిన రికార్డులు ఉన్నాయి.

కూటమి ఎదుర్కొనే అవాంతరాలు

అయితే ఇస్లామిక్ దేశాల మధ్య ఆలోచనా విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ఏర్పాటు అంత సులభం కాదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇరాన్‌తో సౌదీ అరేబియా,ఖతార్,యూఏఈకి పడదు.కానీ ఇస్లామిక్ కూటమిలో ఇవే బలమైన దేశాలు. ఆసియా ఇస్లామిక్ దేశాలు (ఇండోనేషియా,మలేషియా) మిలటరీ బ్లాక్‌లో ఆసక్తి తక్కువ.అంతర్గత రాజకీయ, జాతి విభజనలు కూటమి నిలకడను దెబ్బతీయవచ్చు.పాకిస్తాన్ పన్నుతున్న 'ఇస్లామిక్ నాటో' యత్నం కేవలం రక్షణ ఒప్పందం కాదు. ఇది ఇంధన ఆధిపత్యం,భౌగోళిక రాజకీయ ప్రభావం,తూర్పు–పడమర దౌత్య పోటీ మధ్య ఒక కొత్త బ్లాక్ సష్టించే ప్రయత్నం. భారత్‌కు ముఖ్య సవాలు ఈ కూటమిని విభేదించే దేశాలతో సంబంధాలు బలోపేతం చేసి,ఏకైక ముస్లిం బ్లాక్‌గా మారకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.

# బీసీలను మరోసారి మోసం చేసిన కాంగ్రెస్



హైదరాబాద్,రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మరోసారి మోసం చేసిందని మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో కలసి ఆయన మాట్లాడారు. బీసీల రిజర్వేషన్ జీఓ ద్వారా సాధ్యం కాదని, రాజ్యాంగ సవరణ జరిగితేనే ఫలితం ఉంటుందని ప్రతి అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టంగా చెప్పామని పేర్కొన్నారు. ఈ విషయంలో తమిళనాడు వెళ్లి కూడా అధ్యయనం చేసి వచ్చి వివరించామన్నారు. బీసీలను అవమానం చేసేలా ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. జీఓ న్యాయస్థానంలో నిలబడదని సీఎం, మంత్రులు, అందరికీ తెలుసని అన్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలు జరపాల్సిందేనని డిమాండ్ చేశారు.బీహార్, మహారాష్ట్ర ప్రభుత్వాలు చేసిన తప్పిదాలు చేయవద్దని కోరారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యాకే బీసీ రిజర్వేషన్లు పెంచుతామన్న రేవంత్ రెడ్డి జీవో ఎందుకు ఇచ్చారు. 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తామని జీఓ ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. బీసీలు ఏం చేస్తారు లే అని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెల్లని జీవో ఇచ్చిందని ఆరోపించారు. 1992లో తమిళనాడు సీఎం జయలలిత, ఎమ్మెల్యేలను ఢిల్లీ తీసుకెళ్లి బీసీ రిజర్వేషన్ల కోసం భీష్మించి కూర్చోవడంతో కేంద్రం దిగివచ్చి రాజ్యాంగ సవరణ చేయడం వల్ల తమిళనాడులో బీసీలకు రిజర్వేషన్లు పెరిగాయని తెలిపారు. బీసీలకు రిజర్వేషన్ల కోసం రేపే ఢిల్లీ వెళ్దామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు.42 శాతం బీసీ రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది హెచ్చరించారు.ఎన్నికలకు తొందర లేదు, రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే నిర్వహించాలన్నారు.చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి ఢిల్లీకి కదలాలని, రిజర్వేషన్ల అంశం తేలే వరకు హైదరాబాద్ రావద్దని సూచించారు. 56 సార్లు సొంత పనుల కోసం ఢిల్లీ వెళ్లిన సీఎం బీసీల కోసం ఒక్కసారి ఢిల్లీ వెళ్లి పోరాడాలని సూచించారు. రాహుల్ గాంధీని ఖుషీ చేసేందుకు, పదవులు కాపాడుకునేందుకు కాంగ్రెస్ నేతలు స్టంట్ చేస్తున్నారని మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు.రాష్ట్రపతిని కలవకుండానే ఢిల్లీలో ధర్నా చేసి హంగామా చేశారని ఆరోపించారు.చట్టం పక్రియ పూర్తి కాకముందే జీవోఎలా తెస్తారని ప్రశ్నించారు.బీహార్‌లో ఓటర్లను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.రాహుల్ గాంధీ కోసం తెలంగాణలో బీసీలను బలి పెట్టి రోడ్లపైకి తీసుకొచ్చారని ఆరోపించారు.స్టే వస్తుందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెప్తూ వచ్చారు.హైకోర్టులో కేసు వేసింది కాంగ్రెస్ నేతలేనని పేర్కొన్నారు. ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డెడ్ అనేలా కాంగ్రెస్ వ్యవహరించిందని రవిచంద్ర, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రచారం కోసం బీసీ రిజర్వేషన్లను ఉపయోగించుకుందని విమర్శించారు. అమలు కాదని తెలిసి కూడా మోసపూరిత జీవో తీసుకొచ్చి ఆగం చేశారని మండిపడ్డారు. బీసీల ఆగ్రహ జ్వాలలో కాంగ్రెస్ కూలిపోవడం ఖాయమని పేర్కొన్నారు. బీసీల నోట్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మన్ను కొట్టిందని,అంబేద్కర్ రాజ్యాంగం తమకు పట్టదు అన్నట్లుగా ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని అన్నారు.

# బాబు 'వ్యాపార చాణక్యం'.. ఏపీ చరిత్రలోనే ఇదో అతిపెద్ద విదేశీ పెట్టుబడి



అమరావతి, దేశంలోనే ఏపీకి అతిపెద్ద విదేశీ పెట్టుబడి ఎలా వచ్చింది? గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు వెనుక జరిగింది ఏంటి? పేరు మోసిన నగరాలకు కాదని విశాఖ వైపు ఎందుకు మొగ్గు చూపినట్టు? ఇప్పుడు ఇదే ఆసక్తికర చర్చ. 1999– 2004 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. అప్పట్లో సిఎంగా చంద్రబాబు ఉండేవారు. అప్పటి ఎన్డీఏ ప్రభుత్వంలో కీలక భాగస్వామి కూడా. ప్రధానిగా వాజ్పేయి ఉండేవారు. చంద్రబాబుకు ఎంతో ప్రాధాన్యం ఉండేది. ఆయన సలహాలు, సూచనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేవారు అప్పటి పెద్దలు. అయితే మళ్లీ అదే పరిస్థితి ఇప్పుడు వచ్చింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు భారీగా విదేశీ పెట్టుబడులు వస్తున్న తరుణంలో.. కేంద్ర పెద్దల వద్ద చంద్రబాబు గౌరవం పెరిగినట్లు అయ్యింది.

ఇదే పెద్ద పెట్టుబడి..

విశాఖలో గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పవర్ డేటా సెంటర్ను విశాఖలో ఏర్పాటుకు ముందుకు వచ్చింది. దాదాపు 87 వేల 250 కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమయింది. ఏపీ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ పెట్టుబడి ఇది. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం అప్పట్లో కూడా పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేసింది. ఓ విదేశీ పరిశ్రమ ప్రకాశం జిల్లాలో 25 వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. అప్పట్లో అదో రికార్డ్. కానీ అప్పట్లో ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబుకు అంత మంచి గట్టి సంబంధాలు ఉండేవి కావు. దాని ఫలితంగానే అప్పట్లో ఆశించిన స్థాయిలో కేంద్రం నుంచి సహాయం అందలేదన్నది బహిరంగ రహస్యం.

కేంద్రాన్ని ఒప్పించి..

వాస్తవానికి విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ ముందుకు వచ్చింది. కానీ కొన్ని రకాల షరతులు పెట్టింది. అయితే భూమి కేటాయింపు తో పాటు కొన్ని రకాల మినహాయింపులు ఇవ్వవచ్చు. కానీ డేటా సెంటర్కు సంబంధించిన పాలసీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం ఉండదు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఆ పాలసీ ఉంటుంది. అయితే విశాఖలో గూగుల్ సెంటర్ ఏర్పాటుకు ఈ పాలసీలో కొన్ని మినహాయింపులు ఇవ్వాలని గూగుల్ కోరింది. అందుకే జాప్యం జరిగింది. అయితే ఏపీ సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రధాని నరేంద్ర మోడీతో మాట్లాడారు. కేంద్ర ఐటీ శాఖ మంత్రితో ప్రత్యేకంగా చర్చించారు. దీంతో డేటా సెంటర్ పాలసీలో మార్పులకు కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. కొన్ని రకాల పన్ను మినహాయింపు కూడా ఇచ్చింది. దీంతో డేటా సెంటర్ ఏర్పాటుకు మార్గం సుగమం అయింది.

చంద్రబాబు చొరవతోనే..

కేవలం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్లే గూగుల్ సెంటర్ విశాఖలో ఏర్పాటుకు మార్గం దొరికింది. గూగుల్ పెట్టుబడులు పెట్టేందుకు చాలా నగరాలు ఉన్నాయి. ఆ రాష్ట్రాలు భూములు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నాయి. కానీ చంద్రబాబు ద్వారా డేటా పాలసీని కేంద్రం మారుస్తుందని.. ఆయన అయితేనే మనకు వర్కౌట్ అవుతుందని గూగుల్ ఒక నిర్ణయానికి వచ్చింది. తమ కీలక ప్రతిపాదనలు ఏపీ ప్రభుత్వం ముందు పెట్టింది. కేంద్రాన్ని చంద్రబాబు ఒప్పించడంతో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. మరోవైపు విశాఖలో మూడు చోట్ల గూగుల్ కు స్థలం కేటాయించింది ఏపీ ప్రభుత్వం. భూ సేకరణ బాధ్యతలను ఏపీ ప్రభుత్వం తీసుకుంది. తర్లు వాడలో 200 ఎకరాలు, రాంబిల్లి అచ్చుతాపురం క్లస్టర్లో నోటా 166 ఎకరాలు, అడవివరంలో 120 ఎకరాలు కేటాయించాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరిన వెంటనే ఆమోదముద్ర వేసింది. 2026 మార్చినాటికి నిర్మాణాలు ప్రారంభించి 2028 జూలై నాటికి పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా 1.80 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని భావిస్తోంది. మొత్తానికి అయితే ఏపీ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ పెట్టుబడి రావడం గర్వించదగ్గ విషయం. అయితే ఈ విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు కృషి మరువలేనిది. రాజకీయంగా ఇప్పుడు గుర్తించకపోయిన భవిష్యత్తు తరాలు మాత్రం సీఎం చంద్రబాబు గురించి మాట్లాడుకోవడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# వైసీపీ 'రచ్చ'బండ.. జగన్ ప్లాన్ అదుర్స్!



అమరావతి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది. ప్రజా సమస్యలపై ఫుల్ ఫొకస్ పెట్టాలని భావిస్తోంది. ఈరోజు నుంచి 40 రోజులపాటు ఓ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించింది. కూటమి అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతుంది. అందుకే ప్రభుత్వ వైఫల్యాలపై గట్టిగానే పోరాటం చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు సంబంధించి సమరభేరీ మోగించింది. మిగతా విషయాల్లో సైతం కూటమి ప్రభుత్వం విఫలం అయిందని ఆరోపిస్తూ ఉద్యమాలకు సన్నద్ధం అవుతోంది. ఈరోజు నుంచి రచ్చబండ కార్యక్రమం మొదలుపెట్టనుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఈ ఆందోళన కార్యక్రమాలు జరగాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది.

పార్టీలో నిస్తేజం

2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణంగా ఓడిపోయింది. కనీసం ప్రతిపక్ష హోదా రాలేదు. కేవలం 11 సీట్లకు మాత్రమే పరిమితం అయింది. ఇటువంటి క్రమంలో పార్టీకి భవిష్యత్తు లేదని భావిస్తున్న చాలామంది నేతలు బయటకు వెళ్లిపోయారు. పార్టీలో నెంబర్ 2 గా చలామణి అయిన విజయసాయి రెడ్డి లాంటి నేతలు సైతం పార్టీకి గుడ్ బై చెప్పారు. అయితే పార్టీలో ఉన్నవారు సైతం సైలెంట్ అయ్యారు. చాలామంది సీనియర్లు సైతం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. అటువంటి వారంతా ఈ రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనాలని పార్టీ నాయకత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ వైఫల్యాలపై గట్టిగానే పోరాటం చేయాలని కూడా సూచించింది. లేకుంటే ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని చూసుకుంటామని స్పష్టం చేసింది.

నేతల యాక్టివ్..

చాలా రోజులుగా పొలిటికల్ గా సైలెంట్ గా ఉన్నారు మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు. జగన్మోహన్ రెడ్డి ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా ఆయన యాక్టివ్ అయ్యారు. మాజీ మంత్రి కొడాలి నాని, అనిల్ కుమార్ యాదవ్ లాంటి వారు సైతం క్రియాశీలకం కానున్నట్లు తెలుస్తోంది. కేసుల్లో సుదీర్ఘకాలం జైల్లో ఉండి బయటకు వచ్చిన వల్లభనేని వంశీ మోహన్ లాంటి నేతలు సైతం పార్టీ కార్యక్రమాల్లో హాజరుకావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ నాయకత్వం ప్రతి నియోజకవర్గ నేతతో ఇప్పటికే మాట్లాడినట్లు సమాచారం. ఈ రచ్చబండ కార్యక్రమం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను క్రియాశీలకం చేయడంతో పాటు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం ధ్యేయమని తెలుస్తోంది.

40 రోజుల పాటు కార్యక్రమాలు..

ఈరోజు నుంచి నవంబర్ 22 వరకు 40 రోజులు పాటు ఈ రచ్చబండ కార్యక్రమం కొనసాగనుంది. నియోజకవర్గాల్లో ర్యాలీలు, నిరసనలు, సభలు, సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ప్రతి గ్రామంలో రచ్చబండ నిర్వహించి ప్రజా సమస్యలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలన్నది హై కమాండ్ ఆదేశం. అయితే ఇది కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే విజయవంతం అయ్యే అవకాశం ఉంది. చాలామంది నేతలు క్రియాశీలకంగా లేరు. పార్టీ కార్యక్రమాలను పట్టించుకునే వారు కూడా లేరు. ఆపై కూటమి దూకుడు మీద ఉంది. దీంతో సహజంగానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వెనక్కి తగ్గుతాయి. చూడాలి రచ్చబండ ఎంతవరకు సక్సెస్ అవుతుందో..

# బిహార్ ఎన్నికల్లో ఏఐ వీడియోలపై ఆంక్షలు




న్యూఢిల్లీ,బిహార్ ఎన్నికల్లో ఏఐ వీడియోల వినియోగంపైన ఎలక్షన్ కమిషన్ తాజాగా ఆంక్షలు విధించింది. అభ్యర్థులు తమ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా ఏఐ వీడియోలతో ఎలాంటి ప్రచారం చేయకూడదని స్పష్టం చేసింది. స్వేచ్ఛాయుత వాతావరణంలో, న్యాయబద్ధంగా ఎన్నికలు జరిగేలా ఈ చర్య తీసుకున్నట్టు చెప్పింది. కృత్రిమ మేధ దుర్వినియోగం కాకూడదని పేర్కొంది. ఏఐతో తప్పుదారి పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేయడం వంటి చర్యలకూ దూరంగా ఉండాలని పేర్కొంది. ఇతర సందర్భాల్లో ఏఐ వాడిన సమయంలో ఈ విషయాన్ని ఆయా డిజిటల్ కంటెంట్‌పై కనబడేనలా చూపించాలని కూడా ఎన్నికల సంఘం పేర్కొంది. సోషల్ మీడియాపై దృష్టి పెట్టేందుకు ఇప్పటికే ఈసీ పలు చర్యలు తీసుకుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈసీ తాజా ప్రకటనతో ఏఐ వీడియోలు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌లో(ఎమ్‌సీసీ) పరిధిలోకి వచ్చాయి. దీంతో, ఏఐకి సంబంధించిన నిబంధనలకు అన్ని పార్టీలు కచ్చితంగా కట్టుబడి ఉండాలి. ఎమ్‌సీసీ ప్రకారం, ఇతర పార్టీల ప్రోగ్రామ్‌లు, విధానాలపైనే రాజకీయ కామెంట్స్‌ను పరిమితం కావాలి. వ్యక్తిగత జీవితాలు, ప్రజాజీవితంతో నిమిత్తం లేని అంశాలను ప్రచారంలో వినియోగించకూడదు. వాస్తవాలను వక్రీకరించడం, తప్పుడు ఆరోపణలు గుప్పించడం కూడా చేయకూడదు. నవంబర్ 6 – 11 తేదీ మధ్య బిహార్ ఎన్నికలను రెండు దశల్లో నిర్వహించనున్నారు. నవంబర్ 14న తుది ఫలితాలను విడుదల చేస్తారు. ఈసారి ఎన్నికల నిర్వహణలో సుమారు 8.5 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది పాల్గొననున్నారు.

# 42శాతం రిజర్వేషన్ల కోసం గట్టిగా యత్నించాం



హైదరాబాద్,బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర రాజకీయాలు వేడెక్కుతున్న వేళ, హైకోర్టు స్టేపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హైకోర్టు తీర్పుపై స్పందించారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు కాపీ అందిన తర్వాత పూర్తి అవగాహన చేసుకుని తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. హైకోర్టు 2025 సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు జరపాలని స్పష్టంగా చెప్పింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు మేము గట్టి ప్రయత్నం చేశాం. కానీ, 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వేషన్ పరిమితిని 50 శాతం కట్‌ఆఫ్ చేసి చట్టం చేసింది. ఆ సమయంలో వారు ఓబీసీ రిజర్వేషన్‌పై ఎలాంటి కసరత్తు చేయలేదని భట్టి విక్రమార్క అన్నారు. ఇప్పుడు బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు మాపై నిందలు వేస్తున్నాయి. కానీ ప్రజలు అమాయకులు కాదు, బీసీ సంఘాల నాయకులు అంతకంటే అమాయకులు కాదు. ఎంపిరికల్ డాటా లేకుండా రిజర్వేషన్ ఇవ్వలేమని కోర్టు అప్పటికే చెప్పింది. అందుకే మేము శాస్త్రీయంగా సిపెక్ సర్వే నిర్వహించాం. దానిని బిల్లు రూపంలోకి తెచ్చాం. ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తపడ్డాం అని స్పష్టం చేశారు. మేము అసెంబ్లీలో ఆమోదించిన బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన బిల్లును ఆపింది ఎవరు? బీజేపీ ప్రభుత్వం కదా? వాళ్లే బీసీలకు న్యాయం అడ్డుకుంటున్నారు. బీఆర్ఎస్ 50 శాతం స్లాబ్ దాటకుండా చట్టం చేసిందంటే అదే నిరూపణ. బీసీల నోటికాడి ముద్దను రెండు పార్టీలు లాక్కున్నాయని భట్టి విమర్శించారు. గవర్నర్ బిల్లును మూడు నెలలు ఆపి ఉంచినా, నిర్ణయం తీసుకోకపోతే అది చట్టంగా మారినట్టే. అందుకే మేము జీఓ 9 జారీ చేశాం. సర్వేలో పాల్గొనని పార్టీలు ఇవాళ మాపై విమర్శలు చేస్తూ తగుదనమా అంటున్నాయి. మిమ్మల్ని ప్రజలు క్షమించరు. న్యాయస్థానాల్లో, రాజకీయంగా కూడా 42 శాతం రిజర్వేషన్ కోసం మా పోరాటం కొనసాగుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మేము బీసీ రిజర్వేషన్ల కోసం ధర్నాలు చేసినప్పుడు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఎక్కడ ఉండేవి? అప్పట్లో మాతో రాలేదు, ఇప్పుడు రండి అంటున్నారని అంటూ ఆయన ఎద్దేవా చేశారు.

# పేదల కట్టడాలపైనే హైడ్రా దృష్టి



హైదరాబాద్, హైడ్రా ధనవంతుల కట్టడాలను కూల్చడం లేదని.. కేవలం సామాన్యుల ఇళ్లను కూలుస్తోందని కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రా కూల్చడం తప్ప ఇప్పటివరకు చేయగలిగింది ఏం లేదన్నారు? అన్ని అనుమతులు తీసుకుని కట్టుకున్న ఇళ్లను కూడా కూలుస్తున్నారని గుర్తు చేశారు. చెరువులు, కుంటలను మొత్తం కబ్జాలు చేస్తున్నారన్నారు.. ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న వారికి కబ్జా భూములకు సైతం అనుమతిలిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములు కబ్జా ఆక్రమణలు, నిర్మాణాలపై హెచ్ఎండీఏ, రేరాకు సాక్ష్యాలతో సహా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇదే అంశంపై అసెంబ్లీలో కూడా పలుమార్లు ప్రస్తావించానన్నారు. హైడ్రా కూల్చివేతల పాపం అధికారులదే.. ప్రభుత్వం మమ్మల్ని ఏమీ చేయలేదని ప్రభుత్వ అధికారులు విర్రవీగుతున్నారని మండిపడ్డారు. హైడ్రా తీరు, కబ్జాలతో తాను వేసిన రిట్ పిటిషన్‌పై కోర్టులో విచారణ జరిగింది. కౌంటర్ దాఖలు చేయమని ప్రభుత్వానికి ఆదేశాలు ఇస్తూ హైడ్రా, హెచ్ఎండిఎ, జిహెచ్ఎంసిలకు నోటీసులు జారీ చేయమని చెప్పారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com